ఎమ్మెల్సీ కవితను కలిసిన ఉప్పల వెంకటేశ్

ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి, డిసెంబర్ 1 : జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆదివారం హైదరాబాద్‌లో ఆమె స్వగృహంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్‌నేత ఉప్పలవెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. తన చిన్న కుమారుడు డాక్టర్ అనిల్ రిసెప్షన్‌కి ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. కలిసిన వారిలో నాయకులు గణేశ్, సిద్ధమోని రమేశ్‌గౌడ్, బుచ్చిబాబు, శ్రీను తదితరులు ఉన్నారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

కల్వకుర్తి రూరల్, డిసెంబర్ 1 : వసతి గృహాల్లో నెల కొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీసీ వసతి గృహాలను బీసీ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల గదుల్లో ఫ్యాన్లు, కిటికీలు, మరుగుదొడ్లు సరిగ్గా లేక ఇబ్బంది దుర్భరపడుతున్నారన్నారు. ప్రతిరోజూ విద్యార్థులకు అందించే ఆహార వస్తువులు పరిశీలించి వండించే విధంగా నాణ్యతగా భోజనాన్ని అందించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు విక్రమ్, వీర భద్ర, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మహాగర్జనకు తరలిన మాలలు

కల్వకుర్తిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాలలు

కల్వకుర్తి రూరల్/పెద్దకొత్తపల్లి/ పెంట్లవెల్లి/బిజినేపల్లి/ అచ్చంపేట/కొల్లాపూర్ రూరల్/ తిమ్మాజిపేట, డిసెంబర్ 1 : హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాల మహాగర్జనకు జిల్లాల ఆయా మండల కేంద్రాల నుచి పెద్దఎత్తున మాలలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయా కూడలిల నుంచి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించిన సభకు మాలలు ఐక్యతతో నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి పెద్దఎత్తున తరలి వెళ్తున్నట్లు మాలల సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలలు తదితరులు ఉన్నారు.

పది నాణెలపై అవగాహన కల్పించాలి

రూ.10 నాణెలు

పెంట్లవెల్లి, డిసెంబర్ 1 : రూ.10 నాణేలపై అవగాహన కల్పించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు సంబంధిత బ్యాంక్, ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ పాంతాల్లో కిరాణదారులు రూ.10 నాణెలను పరిగణలోకి తీసుకోవడం లేదని, అంతేకాక ఆర్టీసీబస్సులో కూడా తీసుకోకుండా ప్రయాణికులపై చిరుబుర్రు లాడుతున్నారని జటప్రోలుకు చెందిన పలువురు ప్రయాణికులు మండిపడ్డారు. ఓ పక్క రిజర్వ్‌బ్యాంక్ రూ.10నాణెలు చెల్లుబాటు అవుతాయని, ఎవరైనా వాటిని తిరస్కరిస్తే వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించిన గ్రామాల్లో అవగాహన లేక వివిధ వ్యాపారస్తులు, ప్రజలు తీసుకోవడంలేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పది నాణేలు తీసుకోనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, మార్కెట్‌లో చలామని అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శనేశ్వర, నందీశ్వరాలయాల్లో పూజలు

శనేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, డిసెంబర్ 1 : బిజినేపల్లి మండలంలోని వడ్డెమానులో గల నందీశ్వర, శనేశ్వరాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మొదట శనేశ్వరస్వామికి తిలతైలాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పరమశివుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో విశ్వనాథశాస్త్రి, శాంతాకుమార్, చైర్మన్ గోపాలరావు, ప్రభాకరా చారి, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 2-కే రన్

2కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 1 : ప్రజాపాలనలో భాగంగా 2-కే రన్ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానం నుంచి మినీ ట్యాంక్‌బండ్ వరకు కొనసాగింది. క్రీడాకారులు, విద్యార్థులు రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సీతారాం, డీపీవో రామ్మోహన్, పశుసంవర్ధకశాఖ అధికారి రమేశ్, పీడీ సుభాషిణి, పీఈటీ నరేశ్, ఫుట్‌బాల్, కబడ్డీ అసోసియేషన్‌సభ్యులు, వాకింగ్‌క్లబ్ సభ్యులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

రహదారిపై మట్టిని చదును చేస్తున్న రాంచంద్రారెడ్డి

కల్వకుర్తి, డిసెంబర్ 1 : మండలంలోని కుర్మిద్ద-మాదారం రహదారి పూర్తిగా ప్రమాదకరంగా మారింది. దీంతో రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి తమ సొంత ఖర్చులతో గుంతలమయంగా ఉన్న రహదారిపై ఆదివారం ట్రాక్టర్లతో మొర్రం పోసి మరమ్మతులు చేశారు. రాత్రి సమయంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న పట్టించుకోకపోవడంతో మరమ్మతులు చేసినట్లు చెప్పారు.

తాగునీటి కటకట

- సమస్యల్లో డబుల్‌బెడ్రూం కాలనీ వాసులు
- వీధిలైట్లు లేక అవస్థలు
- పలుమార్లు విన్నవించిన స్పందించని అధికారులు

ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్తున్న కాలనీ వాసులు

అచ్చంపేట టౌన్, డిసెంబర్ 1 : అచ్చంపేట పట్టణంలోని డబుల్‌బెడ్రూంలలో నివాసముంటున్న కాలనీవాసులకు వర్షాకాలం, చలి కాలంలోనే నీటికష్టాలు తప్పడంలేదని, రాబోయే ఎండా కాలంలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని అక్కడ నివాసముంటున్న కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. రోజువారిగా తాగునీటిని విడుదల చేయకుండా మూడురోజులకొసారి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో అక్కడ ఉన్నవారికి సరిపడా తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో డబుల్‌బెడ్రూం నిర్మాణం చేపట్టి వారికి ఇబ్బంది లేకుండా నీటిబోరును ఏర్పాటుచేశారు. కానీ ప్రస్తుతం పనిచేయడం లేదని కాలనీవాసులు వాపోయారు. దాదాపు 150 కుంటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు. వారికి మూడురోజులకొకసారి ట్యాంకర్‌ను పంపడంతో అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు సరిపడా నీరు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ట్యాంకుకు పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం ద్వారా నీటి కొరత తీరే అవకాశం ఉన్నదని, కానీ ప్రభుత్వం మారడంతో సంబంధిత కాంట్రాక్టులు ఆగిపోవడంతో అక్కడ ఉన్న వారికి నీటి కొరత ఏర్పడిందని కాలనీవాసులు వాపోయారు. అధికారులు చొరవ తీసుకొని తాగునీటి సమస్య నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు.

ఇబ్బందులకు గురవుతున్నాం..

తాగునీరు సమయానికి రాకపోవడంతో దినసరి కూలి పని వదిలి ట్యాంకర్ కోసం వేచిచూడాల్సి వస్తున్నది. దీంతో కుటుంబపోషణ భారమైంది. రోజువారీగా తాగునీరు అందిస్తే దినచర్యల్లో మార్పులేకుండా కుటుంబ పోషణకు మార్గం సుగమమవుతుంది. పనులు ముగించుకొని రాత్రివేళల్లో ఇంటికి వెళ్దామంటే వీధిలైట్లు లేక చీకటిలో భయభ్రాంతులతో చేరుకోవాల్సి వస్తుంది. అధికారులు చొరవతీసుకొని త్వరలో నీటి కష్టాల నుంచి తప్పించాలి.

- అన్వర్, డబుల్‌బెడ్రూం కాలనీ

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

డబుల్‌బెడ్రూం ఏర్పాటు చేసి నప్పుడే రెండు నీటిబోర్లను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అందులో ఒకటి మాత్రమే పని చేస్తున్నది. మరొకటి పని చేయకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కొనసాగిస్తున్నాం. త్వరలో మరమ్మతులు చేయించి బోరు ద్వారా నీటికొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

- మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

ఎడమగట్టు విద్యుత్ కేంద్రం రాష్ట్రానికి తలమానికం

- మంత్రి సీతక్క

జెన్‌కోలో విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట, డిసెంబర్ 1 : శ్రీశైలం ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రం తలమానికంగా మారిందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకొని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి పరిశీలించారు. వీరికి చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి స్వాగతం పలికారు. విద్యుత్ ఉద్యోగులతో మంత్రి సమావేశమయ్యారు. సాధారణ బదిలీలపై ఇంజినీర్లు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం దోమలపెంట అటవీశాఖ అతిథి గృహానికి చేరుకోగా, అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గురుప్రసాద్ మంత్రికి స్వాగతం పలికారు. 20వేల మంది ఆర్టీజన్స్ కార్మికులను ఏపీఎస్ఈబీ రూల్స్ ప్రకారం కన్వర్షన్ ఇస్తూ రెగ్యులరైజ్ చేయాలని ఆర్టీజన్స్ సంఘం ఆధ్వర్యంలో మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, టీవీఏజేఏసీ చైర్మన్ మల్లేశ్, కన్వీనర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

వారానికి ఒక్కరోజే మంచినీళ్లు..

దోమలపెంటలో కొంతకాలంగా తాగునీటి సమస్య జఠిలమైందని, వారానికి ఒక్కసారే నీళ్లు వస్తున్నాయని గ్రామస్తులు మంత్రి సీతక్కతో ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి ఒక్కసారి వచ్చే నీళ్లు కూడా గంట మాత్రమే అరకొరగా విడుదల చేస్తారన్నారు. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో సగం నీళ్లు లీకేజీ ద్వారానే వృథా అవుతున్నాయని తెలిపారు. జెన్‌కో స్టోరేజ్ ట్యాంకులు మరమ్మతులు చేస్తే తాగునీటి సమస్య తీరుతుందని చెప్పగా, ఇందుకు మంత్రి స్పందించి సీఎండీ సుల్తానియాకు ఫోన్‌చేసి పదిరోజుల్లోగా స్టోరేజ్ ట్యాంకులు మరమ్మతులు చేసి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

నల్లమలలో పర్యటన

అమ్రాబాద్ డిసెంబర్ 1 : మండలంలోని మల్లెల తీర్థం, సార్లపల్లి, భౌరాపుల్ తదితర చెంచుపెంటల్లో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆదివారం పర్యటించారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 1 : మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మంత్రి సీతక్క అన్నారు. కన్యతండా-ఐనోల్ మధ్య బీటీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేవంశీకృష్ణ ఐనోల్‌లో శిలాఫలకానికి శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఉప్పునుంతల,డిసెంబర్1: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు.ఆదివారం రాత్రి ఉప్పునుంతల నుంచి పల్కపల్లికి 4 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ,నాయకులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 1 : కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికవర్గాన్ని విచ్ఛిన్నం చేసేకుట్రలు చేస్తున్నదని, దీన్ని తిప్పి కొట్టడానికి కార్మికవర్గం సిద్ధంగా ఉండాలన్నారు. 1988 చికాగో అమరవీరుల పోరాట రక్తంతో ఎనిమిది గంటల పనిదినాన్ని సాధించుకుంటే ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12గంటల పనిదినాన్ని అమలు చేయడం కోసం పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ కార్మికులకు మాత్రం కనీస వేతనాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు మధ్యాహ్నం భోజనం తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం కార్మికులకు ఎన్నికలముందు ఇచ్చినహామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, ఈశ్వర్, సహాయ కార్యదర్శులు పాదిల రామయ్య, మల్లేశ్, దశరథం, కోశాధికారి అశోక్, గ్రామ పంచాయతీ కార్మిక నాయకుడు శంకర్, ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు కళావతి, ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి పల్లకీసేవ

స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

తిమ్మాజిపేట, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో కార్తీకమాస ముగింపు సందర్భంగా ఆదివారం ఆంజనేయస్వామికి పల్లకీసేవ నిర్వహించారు. స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పల్లకీపై గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భజనలు, కోళాటాల మధ్య ఊరేగింపు కొనసాగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణు, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, కోటీశ్వరాచారి, రాము పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 1 : విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతపాటు నాణ్యమైన భజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఖాజా నాజీమ్‌అలీ అప్సర్ అన్నారు. ఆదివారం జిల్లా కేందరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్‌వెల్ఫేర్ ఆఫీసర్ తరంగిణి పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

- ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

లింగాల, డిసెంబర్ 1 : రోడ్డు ప్రమాదంలో ఒకరుమృతి చెందగా ఇద్దరు మైనర్ యువకులకు తీవ్రగాయాలైన ఘటన ధారారం సమీపంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి కురువమల్లయ్య(50) అనే గొర్రెల కాపరి ధారారం శివారులో గొర్రెల మందను మేపుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఆదివారం లింగాల సంత కావడంతో కూరగాయలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ధారారం గ్రామానికి చెందిన అరుణ్, సురేశ్ (మైనర్) లింగాల నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తూ ఢీ కొట్టడంతో కురువ మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ఏరియా దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతున్నారు. కాగా ఆ ఇద్దరు యువకులు మైనర్ కావడం విశేషం. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనుమానస్పదంగా వ్యక్తి మృతి

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 1 : నియోజకవర్గ కేంద్రంలో అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకున్నది. కొల్లాపూర్‌లో 9వవార్డులో చౌనివీధికి చెందిన తుల సత్యం(65) హమాలీగా పనిచేస్తున్నాడు. తన ఇంటి సమీపంలో చెట్టుకు ఉరేసుకొని అనుమానస్పద స్థితిలో మరణించారు. సత్యంకు ఇద్దరు భార్యలు, కూతురు ఉన్నారు. కేసు నమోదుచేసుకొని పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పల్లెదవాఖానను వినియోగంలోకి తేవాలి

వెల్దండ, డిసెంబర్ 1 : మండలంలోని చెర్కూర్ గ్రామంలో కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించి ప్రారంభించిన పల్లె దవాఖాన నిరుపయోగంగా మారిందని మాజీ ఉపసర్పంచ్ నర్సింహ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. లక్షలు ఖర్చుపెట్టి ప్రారంభించిన పల్లె దవాఖాన నిరుపయోగంగా మారడంతో గొర్రెలు, మేకలకు అవాసంగా మారిందని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే పల్లె దవాఖానను వినియోగంలోకి తీసుకువచ్చేవిధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీవార్డు సభ్యులు సత్యమాచారి, లాలయ్య, రాంచంద్రయ్య గౌడ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

నేడు బల్మూరులో వార్షికోత్సవ పూజలు

బల్మూరు, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో ఆంజనేయస్వామి 9వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయంనుంచి ప్రత్యేక పూజలను చేశామన్నారు. గ్రామంలోని భక్తులు, స్వామివారి భక్తులు స్వామిని దర్శనం చేసుకోని తీర్థ ప్రసాదాలను తీసుకోవాలన్నారు. అనంతరం రాత్రి సమయంలో అఖండ భజనలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

వెల్దండ, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప నామస్మరణ మారుమోగింది. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి స్వగృహంలో అయ్యప్పపడి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరి హర పుత్రుడికి రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా నిర్వహించారు. వందలాది మంది స్వాములు, భక్తులు పాల్గొని భజన కీర్తనలు ఆలపించగా అయ్యప్ప నామస్మరణ మారుమ్రోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులులు, నాయకులు ఉన్నారు.

రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం

కోదేరు డిసెంబర్ 1 : బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై కాంగ్రెస్ నేతలు మంత్రులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను సహించమని బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు లాలు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల బాట కార్యక్రమం చేపడుతామనగానే కాంగ్రెస్ నేతలకు, మంత్రులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అవినీతి చేశారని మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆహారం అందించారో ఇప్పటికీ ఆయా గురుకులాలకు వెళ్లి విద్యార్థులను అడిగితే చెబుతారని హితవు పలికారు. కాంగ్రెస్ చేస్తున్న మాయల గారడీలను కప్పి పుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గురుకులాల్లో విద్యా భ్యాసం చేస్తున్న పేద విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నతస్థాయిలో ఉండేవిధంగా ఎంతో మందిని తీర్చిదిద్దిన ఘనత ఆర్ఎస్‌దేనని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడిపై నిరాధార వైఖరి ఆరోపణలు చేస్తే చూస్తు ఊరుకోమని ఆయన హెచ్చరించారు. వెంటనే కాంగ్రెస్ నేతలు, మంత్రులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఏమిచ్చారని పండుగలు చేస్తున్నారు ?

వెల్దండ, డిసెంబర్ 1 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు ఏమి ఇచ్చారని, ఏమి సంతోషంగా ఉన్నారని పండుగలు చేస్తున్నారో చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీసర్పంచ్ శేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పి ఎగ్గొట్టి, రైతును మోసగించినందుకు రైతుపండగ చేసుకోవాలా అని ఆయన ప్రశ్నించారు. రుణమాఫీ పేరు చెప్పి అధికారంలోకి వచ్చి పూర్తి స్థాయిలో అమలుచేయకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ 10ఏండ్ల పాలనలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే రైతులు విస్తూపోయారని విమర్శించారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహా, నాయకులు శ్రీను, ప్రసాద్, రాంచందర్‌గౌడ్, రాంచంద్రయ్య,శ్రీను తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

బిజినేపల్లి, డిసెంబర్ 1 : మండలంలోని శాయిన్‌పల్లికి చెందిన యాదయ్య కొన్ని రోజుల కిందట మృతి చెందగా, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మృతుడి తల్లికి ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆవంతి, శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 31 : మండలంలోని చెన్న పూవుపల్లిలో ఆదివారం తెలంగాణ అమర వీరుడు పోలీస్‌కిష్టయ్య వర్ధంతిని కార్యక్రమాన్ని మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కిష్టయ్య చిత్ర పటానికి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పోలీస్ కిష్టయ్య పాత్ర ఘనమైనదన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు ఈశ్వరయ్య, చంద్రయ్య, కోటయ్య, ఊశన్న, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

బాలమల్లేశ్ మృతి తీరనిలోటు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 1 : సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బాలమల్లేశ్ మృతి పార్టీ తీరనిలోటని ఆ పార్టీ నాయకులు రామకృష్ణ, యేసయ్య, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వారు మల్లేశ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుల్లో మల్లేశ్ ఒకరన్నారు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలపాత్ర పోషించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాధకృష్ణ, సాయిలు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోదేరు, డిసెంబర్ 1 : మండలంలోని తుర్కదిన్నెకు చెందిన బాలకిష్టయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడంతో డీఎల్ ట్రస్టు ద్వారా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూర్యారా జేఖర్ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తుర్కది న్నెకు బాలకిష్టయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందారని